www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 నవంబర్ 2022
5
తూర్పుగోదావరి



22న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ నెల 22న ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ కాకినాడ వద్ద ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక బకాయిల విడుదల కోరుతూ చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్ పిలుపునిచ్చారు. గురువారం రాజమహేంద్రవరంలోని యుటిఎఫ్ హోమ్‌లో జిల్లా కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు విడుదల చేయాలని ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇవిఎస్ఆర్.సాద్, శంకరుడు, రవిబాబు, సత్యనారాయణ, రాజు, రమేష్, శ్రీమణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌరసేవల సామర్థ్యం పెంపునకు కృషి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుతో పాటు, ప్రజలకు పౌర సేవలు అందించే సామర్థ్యం పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. గురువారం గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, పౌర సేవలు, రీసర్వే, జగనన్న భూహక్కు - భూరక్ష, సిసిఎల్ఎ, టిడ్కో గృహాలు, గడప గడపకు మన ప్రభుత్వం, స్పందన, ఉపాధి హామీ, అమత్ సరోవర్, క్లాప్ ప్రోగ్రాం తదితర అంశాలపై కలెక్టర్లు, జెసిలు, కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రగతిని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత వివరించారు. జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇచ్చిన 793 పనులలో 735 పనులకు పరిపాలన ఆమోదం ఇచ్చి, వాటిలో 529 పనులు ప్రారంభించామన్నారు. వైద్య విధానంలో సుస్థిర లక్ష్యాలు చేరుకునే దిశగా 9478 క్లస్టర్లలో 9301 క్లస్టర్ పరిధిలో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలకు పౌర సేవల కోసం 512 సచివాలయాల్లో 37,792 సేవలు ఈ వారంలో అందించామని కలెక్టర్ అన్నారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాకు ఈ ఏడాది కేటాయించిన 37 లక్షల పనిదినాలకుగాను 36.61 లక్షల పని దినాలను గుర్తించడం ద్వారా రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కిందన్నారు. సగటు వేతనం పెంపునకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అమృత్ సరోవర్ కింద జిల్లాలో 75 చెరువుల అభివృద్ధి 2023 ఆగస్ట్ 15 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాలకు గాను ఇప్పటి వరకు 19 పనులు పూర్తి చేశామన్నారు. సగటున జిల్లాలో రోజుకు 13 వేల ఉపాధి హామీ పని దినాలు కల్పించినట్లు చెప్పారు. క్లాప్ ప్రోగ్రాంలో జిల్లాలో 392 పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమం కింద 259 షెడ్స్ నిర్మాణం పూర్తి చేశామని, కొత్తగా మరో 41 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వైయస్ఆర్ హెల్త్ క్లినిక్స్ 337 భవనాలకు 123 పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం తో పాటు 83 శాతం స్టేజ్ కన్వర్షన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి సిహెచ్.శ్రీధర్, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు నగరంలో గవర్నర్ పర్యటన


ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ శుక్రవారం రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారు. జిల్లా స్థాయి అధికారులు, ఆయుష్ విభాగంతో సమన్వయం చేసుకుని కార్యక్రమం విజయవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష చేసి, అనంతరం ఆనం కళా కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జాతీయ ఆయుర్వేదిక్ పర్వ్ వేడుకలకు ముఖ్య అతిథిగా గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ హాజరు కానున్న దృష్ట్యా ఏర్పాట్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. గవర్నర్ ఉదయం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌కు చేరుకుని మంజీర అతిథి గృహంలో విశ్రాంతి అనంతరం ఆనం కళా కేంద్రానికి చేరుకుంటారన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సిహెచ్.శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, హోమ్ మంత్రి తానేటి వనిత, ఎంపి, ఎంఎల్ఎలు, కలెక్టర్, అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఆయుర్వేదిక్ డాక్టర్లు తదితరులు పాల్గొనానున్నారని పేర్కొన్నారు. జాతీయ ఆయుర్వేదిక్ పర్వ్ వేడుకల సందర్భంగా ఉచిత ఆయుర్వేద, యునానీ, తదితర సంప్రదాయ వైద్య సేవలు ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, ఎసిపి జెవి.సతీష్, మనోజ్ జెన, రాష్ట్ర కన్వీనర్ బాలు అక్కియా, ఎడిసి పిఎం సత్యవేణి, ఎస్ఇ పాండురంగారావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రమేష్, ఎస్‌డిసి కె.గీతాంజలి, డ్వామా పీడీ జి.రామ్ గోపాల్, డిహెచ్ఒ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బాలోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -దేవరపల్లి


దేవరపల్లి బాలోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జి అన్నారు. గురువారం దేవరపల్లి విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బాలోత్సవం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 14న దేవరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు కల్చరల్, అకడమిక్ సంబంధించిన అంశాలపై పోటీలు నిర్వహణకు కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మూడు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవకులు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు, సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ, ఉండవల్లి కృష్ణారావు, విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పప్పు వెంకట రామారావు, గౌరవాధ్యక్షులు కె.సీతారామయ్య పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి సాబ్జి

'ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి'

ప్రజాశక్తి-కడియం

రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని పలువురు టిడిపి నాయకులు విమర్శించారు. మండలంలోని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి దంపతులు నిర్మించిన వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదానలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. అనంతరం అక్కడ పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏటా రూ.25 వేల కోట్ల ఆదాయం తెచ్చే మద్యం వ్యాపారంలో రూ.వేల కోట్ల అవినీతి దాగుందన్నారు. ఇక ఇసుక, మైనింగ్ వంటి వాటి గురించి అయితే చెప్పనక్కరలేదన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో రైతులను నిట్టనిలువునా ముంచేశారని వారన్నారు. సంక్షేమ ముసుగులో దోపిడీ తప్ప మరొకటి లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, నాయకులు ప్రత్తిపాటి రామారావు చౌదరి, మత్స్యేటి ప్రసాద్, వరగోగులు వెంకటేశ్వరరావు, పాలపర్తి ప్రకాష్, అన్నందేవుల కోదండం, పాక మంగయ్య, చాత్రాది వీరవెంకట చౌదరి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేతలు

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం

ప్రజాశక్తి-గోపాలపురం

పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందించాలని మూడు జిల్లాల స్త్రీ శిశు సంక్షేమ ఆర్గనైజర్ వందనపు సాయి బాల పద్మ తెలిపారు. గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని దేవరపల్లి మండలంలో గల 3, 9 అంగన్వాడీ కేంద్రాలను గోపాలపురంలోని కోడ్ నెంబర్ ఐదు అంగన్వాడి కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రాలలో పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని వారి ఆటపాటలతో కూడిన విద్యను పరిశీలించారు. గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని వైబిటి సుందరి, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఆర్గనైజర్

టిడిపి సమావేశంలో వాగ్వివాదం

ప్రజాశక్తి-గోపాలపురం

టిడిపి మండల సమావేశంలో గురువారం రెండు వర్గాల విభేదాలతో వాగ్వివాదం చోటు చేసుకుని గందరగోళం నెలకొంది. టిడిపి మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. నూతన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు నియమితులైన తరువాత తొలి సమావేశం కావడంతో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావును ఇన్‌ఛార్జి పదవి నుంచి వెంకటరాజును నియమించారని, మండల నాయకులకు సమాచారం ఇవ్వకుండా సంప్రదించకుండా ఎలా మారుస్తారని ముప్పిడి వర్గం నిలదీసింది. దీంతో ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొంది. ముప్పిడి, మద్దిపాటి వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడదిది. తారస్థాయికి చేరుకుంది. అనంతరం వర్గవిభేదాలు లేకుండా ప్రతి ఒక్కకూ కలిసి పనిచేయాని వెంకటరాజు సర్ది చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈలి శరత్ బాబు, యంత్రప్రగడ మంగారావు, నందమూరి సత్యనారాయణ, మేణి సుధాకర్, కొర్లపాటి రాము, కాట్రగడ్డ సురేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను వాలంటీర్ వ్యవస్థ ద్వారా అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పోచవరంలో గురువారం నిర్వహించిన ఇంటింటికీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మూడేళ్ల పాలనలో ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరిస్తూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. గ్రామ సర్పంచ్ కాకర్ల హేమలత వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు మంత్రి వనితకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపిడిఒ ఎం.రాజశేఖర్, తహశీల్దారు టి.రాధిక, వైసిపి నాయకులు నక్కా చిట్టిబాబు, పోసిన శ్రీకృష్ణదేవరాయలు, సిద్ధంశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

దుద్దుకూరు ఆటో కార్మికులకు స్థలం కేటాయించి షెడ్డు నిర్మించాలని సిఐటియు డిమాండ్ చేసింది. 20 ఏళ్ల నుంచి 30 మంది ఆటో కార్మికులు ఇక్కడ జీవనం సాగిస్తున్నారని, తక్షణమే పంచాయతీ అధికారులు స్థలం కేటాయించి షెడ్డు నిర్మించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం సుందర్ బాబు డిమాండ్ చేశారు. కార్మికులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

సిఎం కప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవరపల్లి

దేవరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎపి సిఎం కప్ క్రీడా పోటీలను గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ఎఎంసి చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఎంపిపి కెవికె.దుర్గారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నం, ముగ్గళ్ల విద్యుత్ కేంద్రాల వార్షిక మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఇఇ నక్కపల్లి సామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని చెప్పారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, చీపురుపల్లి, అచియ్యపాలెం, కూనవరం గ్రామాలకు, బొబ్బిల్లంక, కాటవరం, జాలిమూడి, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, రాపాక, సీతానగరం, చినకొండేపూడి, రాజుపాలెం, నాగరత్నం కాలనీలకు సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు.

మాజీ వైస్ ఎంపిపి వీరబాబు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపిపి కన్నా వీరబాబు గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. శుక్రవారం వీరబాబు మృతదేహానికి మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ తెలుగుదేశం పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి రంగారావు, ఉండేశ్వరపురం సర్పంచ్ వనపర్తి తాతాజీ, బేరి శ్రీనివాస్, చిట్టిప్రోలు పద్దరాజు పాల్గొన్నారు.

నేడు మండపేటలో రైతుల ఆందోళన

ప్రజాశక్తి-పెరవలి

మండపేటలో శుక్రవారం చేపట్టిన రైతు ఆందోళనను విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నేత కుందుల సత్యనారాయణ పిలుపు ఇచ్చారు. సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిఐజి పాలరాజుకు సత్కారం

ప్రజాశక్తి-కడియం

లా అండ్ ఆర్డర్ కాపాడుతూ స్నేహపూర్వకంగా తమ పోలీసు శాఖ పనిచేస్తోందని ఏలూరు రేంజి డిఐజి పాలరాజు తెలిపారు. వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు యాదల స్టాలిన్, వారా రాము తదితరులు గురువారం ఏలూరులో డిఐజిని కలిసి సత్కరించారు. బుర్రిలంక ఇసుకర్యాంపు వివాదంలో కేసుల నమోదు నుంచి ఉపసంహరణ వరకు పోలీసులు సంయమనం పాటించారని స్టాలిన్ అన్నారు. కుల, మత, వర్గ వైషమ్యాలకు అతీతంగా పోలీసు శాఖ పనిచేస్తోందని పాలరాజు చెప్పారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలగనివ్వబోమని పేర్కొన్నారు.

ఆక్వా సంక్షోభం తాత్కాలికమే

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ఆక్వా రంగ సంక్షోభం తాత్కాలికమేనని ప్రముఖ ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిదారుడు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని మంజీరా హోటల్‌లో కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన ఆక్వా రైతులతో ఆక్వా ఉత్పత్తులు ఎగుమతిదారులు అసోసియేషన్ అవగాహన సమావేశం నిర్వహించింది. అసోసియేషన్ అధ్యక్షులు ఇంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆక్వా పరిశ్రమలో విపత్తులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి మాట్లాడారు. ప్రస్తుతం దేశంలోని ఆక్వారంగ సంక్షోభం మరో రెండు నెలల్లో సమసిపోవచ్చునని, దేశం నుంచి ఏటా ఎనిమిది లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని, మనం ఎగుమతి చేసే దేశాల్లో ఆక్వా ఉత్పత్తులు పేరుకుపోవడం, రష్యా ఉక్రెయిన్‌లో మధ్య యుద్ధం కారణంగా యూరోపియన్ మార్కెట్ కుదేలవడం, చైనా నిషేధించిన కారణంగా ఈక్వెడార్ దేశం తమ ఆక్వా ఉత్పత్తులను అమెరికాకు తక్కువ ధరకు డంప్ చేయడం సంక్షోభానికి కారణాలని చెప్పారు. కొందరు జగన్ టాక్స్ సంక్షోభానికి కారణమంటూ దుష్ప్రచారం చేస్తున్నారని రైతులు దీనిని నమ్మవద్దని ఆయన అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-నల్లజర్ల

దూబచర్లలో జెడ్‌పి హైస్కూల్, సంఘమిత్ర విద్యాలయ పాఠశాల నుంచి విద్యార్థులు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలోని సిహెచ్ బిఆర్ఎంవి పాఠశాలలో జాతీయ పాఠశాల స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొన్నారు. రాజేశ్వరి, మణిదీప్, దేవి, దుర్గాప్రసాద్, సంఘమిత్ర విద్యాలయ నుండి ఇద్దరు విద్యార్థులు, బాలికల విభాగం నుండి భార్గవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.సుమతి అధ్యక్షత వహించగా విద్యార్థులను దూబచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుమతి మాట్లాడుతూ పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ బివి.స్వామి యోగ సాధనకు యోగా మ్యాట్లు ఇచ్చి పిల్లలను ప్రోత్సహించినందుకు వారికి రాష్ట్రస్థాయి గెలుపుకు కారణమైన యోగా గురువు రాజారావు మాస్టారుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ గురువు దూబకుంట్ల రాజారావు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి-గోపాలపురం, కొవ్వూరు, ఉండ్రాజవరం

వ్యాధుల బారిన పడకుండా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నూతంగి సరోజిని అన్నారు. గురువారం గోపాలపురం మండలంలోని చిట్యాల గ్రామం వద్ద హెల్త్ క్లినిక్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సరోజిని, వైద్యులు కరిష్మా, ఎ.డేవిడ్ రాజ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నామని మార్కొండపాడు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ పి.రవికుమార్ అన్నారు. కొవ్వూరు మండలం మద్దూరులో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర ప్రసాద్ (బాబ్జి), వైసిపి నాయకులు తోట నారాయణ, ఆరోగ్య సిబ్బంది, నాగలక్ష్మి, బాబ్జి, పద్మావతి, వెంకటలక్ష్మి, బేబీ పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషా దేవి, 104 వాహన డాక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఐదుగురు గర్భిణులు, 28 మంది బిపి, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు, మొత్తం 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి డి.ప్రశాంతి, ఎఎన్ఎం వి.శివపార్వతి, సూపర్‌వైజర్లు జి.వెంకట రాజు, కెకె.సుభాషిణి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన


ప్రజాశక్తి-గోకవరం

అచ్యుతాపురంలో సర్పంచ్ బత్తుల వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గరువారం నాడు-నేడు అభివృద్ధి పనులకు ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామంలో రూ.44 లక్షలతో ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ఒక్క జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని తెలిపారు.

వికలాంగుల కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రముఖ సమాజ సేవకురాలు మోసిగంటి సునీత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మదర్ థెరిసా హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆమె ఆర్థిక సాయంతో పాలంగి స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సేవాస్తంబ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బొడ్డు విక్టర్ బాబు మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలను ఆదర్శంగా తీసుకుని ఎంతోమంది నిరుపేదలకు, వయోవృద్ధులకు, రోగ పీడితులకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం సులోచన, విక్టర్ బాబు దంపతుల జన్మదినోత్సవ కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. సాక రాజు, నక్క నరేష్ కుమార్ పాల్గొన్నారు.



ఒకప్పుడు ఇక్కడ పెద్ద..
కొండ ఉండేది.. తెలుసా..!!

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రజాశక్తి-చాగల్లు

ఇటీవల ఫ్యాక్టరీల్లో జరిగిన ప్రమాదాల్లో మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మృతుడు దొంగ మహిధర్ ముసలయ్య కుటుంబ సభ్యులను గురువారం పార్టీ నాయకులు పరామర్శించారు. జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో పరమేష్ బయోటెక్ పరిశ్రమలో ఇద్దరు కార్మికులు, త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీ పరిశ్రమలో ఒకరు, కొండగూడెం విజన్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ముగ్గురు కార్మికులు ఫ్యాక్టరీలో పని చేస్తుండగా పేలుడు జరిగి చనిపోయారన్నారు. వరుసగా ఒక మండలంలో తరచూ ప్రమాదాల జరుగుతున్నా ఆ పరిశ్రమల యజమానులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. మృతుల బంధువులు కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తే నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. జిల్లాలో అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి సేఫ్టీ మెటీరియల్, పరిశ్రమల నిర్వహణచట్టం ప్రకారం అన్ని నిబంధనలు పాటించేలా ప్రొడక్షన్‌కు సరిపడా కార్మికుల నియమించాలని డిమాండ్ చేశారు. పార్టీ ప్రజాసంఘాల నాయకులు జజ్జవరపు శ్రీను, షేక్ ఆదం, గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, శ్రీను, కంకటాల సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

మహిధర్ కుటుంబానికి జవహర్ పరామర్శ

ప్రజాశక్తి-చాగల్లు

గౌరీపట్నం కెమికల్ ఫ్యాక్టరీలో ఇటీవల మరణించిన దొంగ మహిధర్ కుటుంబాన్ని మాజీ మంత్రి టిడిపి నాయకులు కెఎస్.జవహర్ గురువారం పరామర్శించారు. కుడిపూడి సత్తిబాబు ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని జవహర్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి వీరరాఘవులు, చాగల్లు మండల టిడిపి సీనియర్ నాయకులు కరుటూరి సతీష్, కోడి చంటియ్య కొడవటి మెహర్ బాబా, కేతా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి-గోకవరం

వీరలంకపల్లిలో గురుకుల బాలికల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపల్ మంజుల రాణి వేణి ఆధ్వర్యంలో 490 మంది విద్యార్థినులకు డాక్టర్ సునీత దంత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరీక్షలతో వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు, రమ్య, సుజాత, అశోకవర్ధన్, సూర్యకాంతం, మహాలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ ఆశా, గిరి పాల్గొన్నారు.

సత్యనారాయణ నేత్రాలు దానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

నేత్రదానం ద్వారా మరొకరికి కంటి చూపును అందించాలని మానవత సంస్థ చేస్తున్న ప్రయత్నం ఫలించిందని శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. విశ్రాంత ఉద్యోగి మానవత సభ్యులు పెద్దేవంకు చెందిన కొత్త సత్య నారాయణ అనారోగ్యంతో మరణించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సత్యనారాయణ కార్నియాలను రాజమండ్రి గౌతమీ నేత్రాలయ వైద్య సిబ్బంది సహకారంతో కాకినాడ పంపించినట్లు జోడాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పన చంద్రధర గుప్తా, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి ఆంజనేయులు ఇసి సభ్యుడు సనపల రాజశేఖర్, సోమరాజు కెఎస్.రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

దామిరెడ్డిపల్లిలో గడపగడపకూ..

ప్రజాశక్తి-కడియం

దామిరెడ్డిపల్లిలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి రూరల్ వైసిపి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలుసమస్యలను చందన దృష్టికి తీసుకురాగా, అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని ప్రజలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎంసి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

1958లో ప్రారంభించిన కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ 65వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పూర్వ మెడికల్ విద్యార్థులు, రామకోశా, ఐఎంఇ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, రామకోశా అధ్యక్షుడు డాక్టర్ వాడ్రేవు రవి ఆధ్వర్యంలో ఈ వేడుకల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అందరూ కలసి కళాశాల వ్యవస్థాపకులు అయిన కల్నల్ డాక్టర్ డిఎస్ రాజు, ఎం.వి. కృష్ణారావు, ముళ్ళపూడి హరి చంద్రప్రసాద్, డాక్టర్ పివియన్ రాజుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా మెడికల్ సబ్జెక్టుకు సంబంధించిన అన్ని విషయాలు తెలుసు కోవడానికి, ఉపన్యాసాలు వినడానికి, తమ అభిప్రాయాలను వ్యక్తపరచి అనుమానాలు తీర్చుకోవడానికి ఉపయోగపడే, 4.45 లక్షల విలువైన డిజిటల్ బ్లాక్ బోర్డును 1974 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు, రామకోశా, ఐయమ్ఇ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా డిజిటల్ బ్లాక్ బోర్డు ఇన్ చార్జ్ ఎస్‌వి లక్ష్మీ నారాయణను సత్కరించారు. కార్యక్రమంలో రామకోశా కార్యదర్శి వై. కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి సిహెచ్ కిరణ్, డాక్టర్ జవహర్ తదితర డాక్టర్లు పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణ ను సత్కరిస్తున్న డాక్టర్లు

కొత్త వాలంటీర్ల నియామకం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న స్థానాల్లో 51 మంది వాలంటీర్లను నియమించారు. ఈనెల ఏడవ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఎంపికైన వాలంటీర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఏడిసి సిహెచ్ నాగ నరసింహారావు గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం కమిషనర్ రమేష్ మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన వాలంటీర్లు తమకు కేటాయించిన క్లస్టర్లలో క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలోనూ, నిర్దేశించిన విధు ల్లోనూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఎడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన వాలంటీర్లకు త్వరలోనే శిక్షణా కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ మానే కష్ణమోహన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇకపై ఎక్కడికక్కడే చెత్త విభజన

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చెత్త ఉత్పత్తి అయిన ప్రాంతంలోనే తడి-పొడి చెత్తగా విభజన జరగాల్సి ఉంటుందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్ అన్నారు. గురువారం అయన ప్రభుత్వాసుపత్రి వెనుక ఫ్రేజర్ పేట ప్రాంతంలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు తడి-పొడి చెత్తను వేరువేరుగా ఇస్తున్నారో లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్జీటీ ఆదేశాల మేరకు చెత్త సేకరణ సులభతరంగా ఉండేందుకు నగరపాలక సంస్థ మూడు డస్ట్‌బిన్‌లను ప్రజలకు అందించిందన్నారు. చెత్తను వాటిల్లోనే వేరువేరుగా విభజించి ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కమిషనర్ కోరారు. ఈ విషయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు.

ఎపియుడబ్ల్యుజె కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి గండేపల్లి

ఏపీయూడబ్ల్యూజే కార్తీక వన సమారాధన, ఆత్మీయ సమావేశం గురువారం జగ్గంపేటలో ఘనంగా జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు స్వాతి ప్రసాద్, ఐజేయు రాష్ట్ర నాయకులు మండేలా శ్రీరామ్మూర్తి, ఐజెయూ సభ్యులు రాకుర్తి రాంబాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు అంజి బాబు, ఐజెయు మాజీ సభ్యులు వేల్పుల సూరిబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర ప్రసాద్, జిల్లా కోశాధికారి వెలిది వెంకటరత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు అడపా శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. జిల్లా, రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సీనియర్ పాత్రికేయులు ఆంజనేయులు పాల్, అధ్యక్షులుగా అడపా వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా నేదూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా చింతల రాంబాబు, సహాయ కార్యదర్శిగా పెనుగొండ సత్యానందం, కోశాధికారిగా గోరంట్ల కుమార్‌పాల్, 2వ ఉపాధ్యక్షులుగా సుంకర శ్రీనివాస్, 3వ ఉపాధ్యక్షులుగా అలమండ శ్రీనివాసరావు, 2వ కార్యదర్శిగా నేదూరి చినబాబు, కార్యవర్గ సభ్యులుగా కాపవరపు భాస్కరరావు, వానపల్లి గంగాధర్, చింతపల్లి శివ, మద్దాల లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

జగనన్న ఇల్లు నిర్మాణాలు త్వరగా చేపట్టాలని డెవలప్మెంట్ ఆఫీసర్ పి నారాయణమూర్తి అధికారులు ఆదేశించారు. గురువారం ఆయన పొన్నాడలో పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతుల గదులను, ఆర్‌బికే సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం జగనన్న గహ నిర్మాణాలను, గ్రామ సచివాలయ నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గృహ నిర్మాణాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సూచనలు అందజేశారు. ఆయన వెంట ఎంపిపి కారే సుధా శ్రీనివాస్, ఎంపిడిఒ పి. రామారావు, సర్పంచులు ఉమ్మిడి మేరీ జాన్, బండి రాణి దావీద్, హౌసింగ్ ఏఈ వెలుగు, ఏపిఎం విష్ణు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నిర్మాణాలను పరిశీలిస్తున్న నారాయణమూర్తి


ఐ.పోలవరం జెడ్‌పిపాఠశాల్లో చికాగో బృందంతో ఉపాధ్యాయులు

హైస్కూల్‌ను సందర్శించి చికాగో బృందం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఐ.పోలవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జెడ్‌పి ఉన్న పాఠశాలను చికాగో స్టేట్ యూనివర్శిటీ బృందం గురువారం సందర్శించింది. హైస్కూల్ హెచ్‌ఎం వీధి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎంఇఒ కె.వెంకటేశ్వరరావు సమక్షంలో ఎన్‌సిసి విద్యార్థులతో వారికి స్వాగతం పలికారు. విద్యా ప్రమాణాలు, డిజిటలైజేషన్ విద్యా బోధాన విధానాలు, మధ్యాహ్నభోజన పథకం, ఎపి ప్రభుత్వం చేస్తున్న పలు పథకాలు గురించి హెచ్ ఎం వి సురేష్ బాబు లీడ్ పరిశోధకులు డాక్టర్ వెండి వాంగ్, రీసెర్చ్ మేనేజర్ సర్దుల్ ఒజా, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కన్సల్టెంట్ పడియోత్ శ్రీరామన్, ఫీల్డ్ మేనేజ్ మెంట్ స్టాఫ్ కన్వెజీనియస్ రామ్ కుమార్‌కు వివరించారు. అనంతరం స్కూల్లో ఉన్న పాల్ ల్యాబ్‌ను పరిశీలించారు. **కాట్రేనికోన** కాట్రేనికోన జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన పాల్ లాబ్ ను చికాగో బృందం బుధవారం పరిశీలించింది. హెచ్‌ఎం ఎన్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులను అడిగి వారు తెలుసుకున్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-రాజోలు

ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించి కూలీలను ఆదుకోవాలని ఉపాధి కూలీ సంఘం రాజోలు నియోజకవర్గం అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సఖినేటిపల్లి మండలం, కేశవదాసుపాలెం గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లా బత్తుల లాజరు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లెల్ల రత్నకుమారి, కొల్లాబత్తుల బ్రోనాల, జిల్లెల్ల మార్టిన్ లూథర్ కింగ్, చెల్లుబోయిన నరసింహమూర్తి పాల్గొన్నారు.


ప్రమాదం జరిగిన ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ తోట సునీత

ఆయిల్ పరిశ్రమలో ప్రమాదం
ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం హుస్సేన్‌పురం వెంకట్రామా అయిల్ ప్యాక్టరీలో గురువారం రాత్రి సంభవించిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు, ప్యాక్టరీ గుమస్తాకు గాయాలయ్యాయి. పరిశ్రమలో కార్మికులు వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగసి మీద పడడంతో అదే గ్రామానికి చెందిన చైతన్య రమణ (30), వేట్లపాలెం గ్రామానికి చెందిన మండ వెంకటేశ్వరరావు (40)తీవ్రంగా గాయపడగా, పనులు పర్యవేక్షిస్తున్న వేట్లపాలెం గ్రామానికి చెందిన మరో వ్యక్తికి కూడా గాయాలైనట్లు సమాచారం. విషయం తెలిసిన సామర్లకోట ఎస్ఐ తోట సునీత సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. క్షతగాత్రులను తొలుత చికిత్స నిమిత్తం మాధవపట్నం సూర్య గ్లోబల్ ఆసుపత్రికి తీసుకెళ్ళి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై సామర్లకోట ఎస్ఐ తోట సునీతను వివరణ కోరగా ప్రమాదం వాస్తవమేనని పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని చెప్పారు.


సిఐ సూర్యఅప్పారావును అభినందిస్తున్న హిజ్రాల సంఘం

సిఐకి హిజ్రా సంఘం అభినందనలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మల్లేపల్లి జాతి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మతి చెందిన హారతి పోస్టుమార్టం నిమిత్తం ఆర్థికంగా సహాయ సహకారాలు అందించి త్వరగా పంచినామా రిపోర్ట్ అందించి మానవత్వం చాటుకున్న జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూర్య అప్పారావు ను జగ్గంపేట హిజ్రా సంఘ సభ్యులు అభినందించారు. పొట్టకూటి కోసం వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మతి చెందడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్‌కుమార్

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీలో గండేపల్లి ఎస్ఐ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్. మాదకద్రవ్యాలు. లోన్ యాప్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు కళాశాలలకు పంపిస్తే ప్రతి ఒక్క విద్యార్థిఉన్నత స్థాయికి ఎదిగే విధంగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎఎస్ఐ శేఖర్ పాల్గొన్నారు

శాశ్వత భూహక్కు సర్వే పరిశీలన

ప్రజాశక్తి- కరప

మండలంలోని నడకుదురు, వేలంగి, యండమూరు గ్రామాలలో జగనన్న శాశ్వత భూహక్కు సర్వేలను పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. గురువారం ఆయా గ్రామ సచివాలయాల్లో సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూ రికార్డుల్లో తప్పులు లేకుండా హక్కుదారుడే పొందేలా ఈ సర్వే జరుగుతుందని శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బ్రహ్మానందం, వీరభద్రరావు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే బాధితురాలు కామాక్షి మృతదేహం

తరలింపులో పోలీసుల నిర్లక్ష్యం
రోడ్డుపై బైఠాయించిన బంధువులు
ఆర్ఎస్‌పేటలో టిడిపి, జనసేన ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్, బిక్కవోలు

తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో వైసిపి నేతల వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లీ కుమారుల్లో తల్లి కోటిపల్లి కామాక్షి (66) బుధవారం అర్ధరాత్రి కాకినాడ జిజిహెచ్‌లో మృతి చెందారు. బలభద్రపురం తోటపేట శివారుకు చెందిన కోటిపల్లి కామాక్షి ఆమె కుమారుడు మురళీకృష్ణ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. వారు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి కామాక్షి మృతి చెందారు. గురువారం ఉదయం 11 గంటలకే ఆమె మృతదేహానికి పంచనామా పూర్తయిన తర్వాత మృతదేహాన్ని మహాప్రస్థానం వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు రోడ్డు మీద ఆపేశారు. ఎందుకు ఆపేసారని బంధువులు పోలీసులను అడుగగా డ్రైవర్ భోజనానికి వెళ్లారు, వచ్చాక తీసుకువెళ్తామని మూడు గంటలపాటు రోడ్డుపైనే ఉంచేశారు. బంధువులు ప్రైవేటు వాహనంలో మృతదేహాన్ని తరలిస్తామన్నా పోలీసులు అడ్డుకున్నారు. బంధువులు తీసుకు వచ్చిన ప్రైవేటు వాహనదారులపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోకపోతే కేసు పెడతామని బెదిరించారు. దీంతో బంధువులు రోడ్డుపై బైఠాయించి శానిటైజర్ తాగి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మృతదేహాన్ని అనపర్తి తరలించారు. కామాక్షి మతదేహాన్ని అప్పగించడంలో జాప్యంపై టిడిపి, జనసేన నాయకులు కామాక్షి కుటుంబ సభ్యులతో కలిసి బిక్కవోలు మండలం ఆర్ఎస్ పేటలో ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళన ఒక దశలో ఉద్రిక్తతకు దారి తీసిన నేపథ్యంలో పోలీసులు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన నేతలు ఇందల వీరబాబు, రావాడ నాగులను అదుపులోకి తీసుకుని రంగంపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు.


బంధువులు ప్రైవేట్ వాహనంలో కామాక్షి మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ఎపి ఆర్ సెట్ 2022 ఇంటర్వ్యూకు 31 మంది హాజరు

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్ టియుకె ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2022 (ఏపి ఆర్సెట్)లో అర్హత సాధించిన అభ్యర్థులకు జెఎన్‌టియుకెలో గురువారం నుండి రెండు రోజుల పాటు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఇంటర్వ్యూలలో భాగంగా తొలిరోజు గురువారం 42 మంది హాజరు కావాల్సి ఉండగా 31 మంది హాజరయ్యారు. తొలుత విసి జి.వి.ఆర్.ప్రసాదరాజు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బిఓఎస్) ఛైర్మన్లు, విభాగాధిపతులు, ఇంటర్నల్, ఎక్స్‌ట్రనల్ సభ్యులతో కలిసి ఇంటర్వ్యూల నిర్వహణపై గురువారం సమీక్షించారు. విసి ప్రసాదరాజు మాట్లాడుతూ ఏపి ఆర్సెట్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 17, 18వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్, రోస్టర్ పాయింట్స్ ప్రాతిపదికన 2022-23 విద్యా సంవత్సరానికి గాను పిహెచ్‌డిలో ప్రవేశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 42మంది హాజరు కావాల్సి ఉండగా 31 మంది హాజరయ్యారయని వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డైరెక్టర్ అడ్మిషన్స్ ఏ.కష్ణమోహన్ తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో ఆరుగురికి ప్రొవిజినల్ సర్టిఫికెట్స్, ఓడీలు లేనందున ఇంటర్వ్యూలకు అనుమతించ లేదన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కె.వి. రమణ, రిజిస్ట్రార్ ఎల్. సుమలత, ఓఎ డి.కోటేశ్వరరావు, డైరెక్టర్ అకడమిక్ ఆడిట్ (డిఏఏ) సిహెచ్. సాయిబాబు, ఆర్ అండ్ డి డైరెక్టర్ వి.రవీంద్ర, ఐఐఐపి అండ్ టి డైరెక్టర్ జి.ఏసురత్నం, డిఏపి కెవిఎస్.మురళీకష్ణ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బిఓఎస్) ఛైర్మన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



పెద్దవలసలలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పొన్నాడ

మత్స్యకారులకు రూ.400 కోట్ల నష్టపరిహారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

చమురు సంస్థల కార్యకలాపాల వల్ల నష్టపోయిన మత్స్యకారులకు జి.ఎస్. పి.సి, ఓ.ఎన్‌జిసి. సంస్థల ద్వారా రూ. 400 కోట్లు లబ్ధి చేకూరుతున్నట్లు ఎంఎల్ఏ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తెలిపారు. గాడి మొగ పంచాయతీ పరిధిలోని గాడిమొగ, పెద్దవలసల, లక్ష్మీపతిపురం, చిన్న వలసల గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 63 గ్రామాల్లో 24 వేల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,50,000 చొప్పున లబ్ధి వస్తున్నట్లు తెలిపారు. ఈ నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా 24 వేల మందికి ఒక్కొక్కరికి రూ.46000 సీ.ఎం. జగన్మోహన్ రెడ్డి వర్చువల్ మీటింగ్ ద్వారా బటన్ నొక్కి లబ్ధిదారుల అకౌంట్లో వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు లబ్ధి చేకూరని 1200 మందికి అదే రోజు లబ్ధి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.పి.పి. రాయుడు సునీత, జడ్‌పిటిసి సామ్యూల్ సాగర్, స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉపసర్పంచ్ కోక్కిలగడ్డ లోకేష్, ఎంపీటీసీలు వనమాడి వేణి, రేఖాడి నరసింహమూర్తి, కామేశ్వరరావు, పోతాబత్తుల నూకరాజు, అంగడి అంజి బాబు, వైదాడి ధర్మారావు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఫీజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం "టగ్ ఆఫ్ వార్" పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి మెడల్, రూ.2000, ప్రశంసా పత్రం పత్రాలను, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మెడల్ రూ.1000, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ సి.హెచ్. మురళి మోహన్, నవీన్,బి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సెల్వమలార్‌ను సత్కరిస్తున్న శామ్యూల్‌రెడ్డి, జైళ్ల శాఖ అధికారి రాజారావు

డాక్టర్ సెల్వమలార్‌కు గురు స్పందన పురస్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సెల్వమలార్ స్పందన ఇదా ఇంటర్నే షనల్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల సదస్సులో 'గురు స్పందన" పురస్కారం అందుకున్నారు. స్పందన ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఇదా శామ్యూల్ రెడ్డి, రాజమహేంద్రవరం జైళ్ల శాఖ సూపరింటెండెంట్ ఎస్. రాజారావులు ఈ అవార్డును సెల్వమలార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆదిత్య అధినేత డాక్టర్ ఎన్. శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణ రెడ్డి, ప్రిన్సిపాల్. ఎం.శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల డీన్ లు విభాగాధిపతులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

వేట్లపాలెం వాలంటీర్ల రాజీనామాల ఉపసంహరణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇటీవల పనిభారం ఎక్కువగా ఉందని విధులు చేయలేకపోతున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలాక్కియాకు రాజీనామా పత్రం ఇచ్చిన సామర్లకోట మండలం వేట్లపాలెం 1, 2, 3, 4 సచివాలయాలకు చెందిన సుమారు 68 మంది గ్రామ వాలంటీర్‌లు ఇచ్చిన లేఖను వెనక్కి తీసుకున్నట్లు సామర్లకోట ఎంపిడిఒ డి శ్రీలలిత తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె ఒక ప్రకటనలో విడుదల చేశారు. మొదటి తప్పుగా భావించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్‌లు వినతి పత్రం అందించినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు చెందిన విధులు అన్ని సక్రమంగా చేయగలమని లేఖలో పేర్కొని, విధులకు జాయిన్ అయినట్లు ఎంపిడిఒ శ్రీలలిత వివరించారు. ఇటీవల ధాన్యం కొనుగోలు విధులు చేపట్టలేమని వలంటీర్‌లు సామూహికంగా జాయింట్ కలెక్టర్‌కు రాజీనామాలు ఇచ్చినట్లు సమాచారం.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల లాకుల సమీపంలో 216 నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్త మతి చెందినట్లు ఆలమూరు పోలీస్ పెట్రోలింగ్, జాతీయ రహదారుల పెట్రోలింగ్ అధికారులు తెలిపారు. అంబాజీపేట మండలం చిరతపూడికి చెందిన యలమంచిలి నాగరాజు (48) రాజమహేంద్రవరం వైపు నుంచి రావులపాలెం వైపు బైక్‌పై వస్తున్నాడు. అయితే చొప్పెల్ల లాకుల సమీపంలో వ్యతిరేక దిశలో వస్తున్న (ఐషర్ వ్యాన్) వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను మృతి చెందాడు. దీనిపై ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. టోల్ మేనేజర్ నెహెమియా, హైవే అధికారులు విజయ్, రమేష్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి -చాగల్లు

సారాబట్టీపై పోలీసులు గురువారం దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. చాగల్లు నుంచి చిక్కాల వెళ్లి రోడ్డులో రోడ్డు పక్కన ఉన్న పొలాలలో సారా కాస్తు ఉన్న ఇద్దరు వ్యక్తులను చాగల్లు ఎస్ఐ సిహెచ్.వి.రమేష్ వారి సిబ్బంది అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లు, 18 లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా వారికి 15 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. **దేవరపల్లి** కొవ్వూరు ఎస్ఇబి గురువారం నాడు జరిపిన దాడుల్లో యాదవోలుకు చెందిన బొల్ల గంగారత్నం, గౌరీపట్నానికి చెందిన ఏపూరి గంగారత్నంలను నుంచి ఐదు లీటర్ల సారా, 30 లీటర్లు తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట, 7 లీటర్ల సారా తో అరెస్టు చేశారు. నిందితులను కొవ్వూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు

పంటు పైనుంచి జారిన కారు

ప్రజాశక్తి రామచంద్రపురం

కోటిపల్లి వద్ద గోదావరి పంటుపై ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు గోదావరిలోకి జారింది. దీంతో ప్రయాణికులంతా దానిని బయటకు లాగడంతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇవి.. అమలాపురం నుంచి ద్రాక్షారామ వస్తున్న కారు కోటిపల్లి రేవులో పంటు మీద ప్రయాణం చేస్తూ దిగుతున్న సమయంలో పంటుకి కట్టిన తాడు లూజు అయి పంటు ముందుకు జరిగింది. దీంతో కారు గోదావరిలోకి దిగబడింది. అప్పటికే కారులో ఉన్న ప్రయాణికులు దిగిపోయారు. అయితే డ్రైవర్ మాత్రమే ఉండటంతో అతడు వెంటనే దిగిపోయాడు. వాహనం యజమాని గొల్లలమామిడాడగా తెలిసింది. ఈ లోగా తోటి ప్రయాణికులు అంతా కలిసి కారు గట్టు వైపు లాగడంతో ప్రమాదం తప్పింది. పంటుపై వాహనాలు ఎక్కించేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

In The Court Of The IVth Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 450/2020

Between:
Canara Bank (Previously Syndicate Bank) Rep. by its Senior Branch Managar, Vakalapudi Branch, Kakinada. ***...Plaintiff***

AND

Nallam Vara Lakshmi and anothers ***...Defendant***

TO:
1) Nallam Varalakshmi, W/o. Late Subba Rao, Aged 58 Years, Penisioner, D.No. 70-2-138/1, Ramanayyapeta, Kakinada.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.23-11-2022వ తేదీకి** వాయిదా వేసినారు. **కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
వేగుళ్ళ వెంకటరమణ మూర్తి
అడ్వకేట్, గాంధీ నగర్, కాకినాడ. సెల్: 98660 33899

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -ఆత్రేయపురం

ఆత్రేయపురం పేరవరం సబ్ స్టేషన్లు, లైన్స్ మరమ్మతులు కారణంగా 17 గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంఫరాకు అంతరాయం కలగుతుందని ఎలక్ట్రికల ఇఇ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు **కాట్రేనికోన** సబ్ స్టేషన్ పరిధిలోని చెట్లు తొలగింపు, మరమత్తు పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చకాయలు పోర, నడవపల్లి, దొంతుకురు, గద్దనపల్లి, కొప్పుకుంట, కందిపప్పు, పల్లంకురు, బలుసు తిప్ప గ్రామాలకు సరఫరా నిలుపివేస్తామని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం రవికుమార్ గురువారం తెలిపారు.

యూత్ ఫెస్టివల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరులో శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువాంర జరిగిన అభినందన సభలో విజేతలను సెక్రెటరీ, కరెస్పాండంట్ డివిఎస్ఎస్.వర్మ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రత్నరాజు, కళాశాల పాలకవర్గ సభ్యులు రమేష్ రాజు, సందీప్‌లు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-ఐ పోలవరం

ఐ.పోలవరం గ్రామ పంచాయతీ పరిధిలో నాడు-నేడు ఫేస్-2 పనులకు గురువారం ఎంపిపి మోర్తరాణి మిరియం జ్యోతి సమక్షంలో జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి వీర వెంకట సత్య సుబ్బరాజు(సతీష్ రాజు) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు దంతులూరి రాఘవరాజు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజువెంకట పతిరాజు, ముమ్మిడివరం నియోజకవర్గ మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంటు విత్తనాల శ్రీనివాసరావు, కేశనకుర్రు సొసైటీ అధ్యక్షులు ఇందుకూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఇటీవల నిర్వహించిన పీజీ సెట్ నందు కాట్రేనికోనకు చెందిన సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. బిఏ పూర్తిచేసిన విద్యార్థుల్లో నలుగురు 4 యూనివర్శిటీల్లో, ఇద్దరు వివిధ కళాశాలల్లో సీట్లు పొందినట్లు ప్రిన్సిపల్ కొంకే రవికుమార్ తెలిపారు. వాటికి సంబంధించిన పత్రాలను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ ఎం.నాగరాజు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులను పలువురు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి -ఆత్రేయపురం

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ నాతి బుజ్జి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి పట్టాభిరామయ్య, హౌసింగ్ ఎఇ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలని జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. కొండుకుదురు జెడ్‌పి ఉన్నత పాఠశాల గురువారం ఆయన సందర్శించారు. ఆయన టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మనబడి నాడు-నేడు ఫేజ్-2 పనులను పరిశీలించారు.

జెర్సీ ఆవుకు ఓకే కాన్పులో నాలుగు దూడలు

ప్రజాశక్తి - ఆలమూరు

జెర్సీ ఆవు ఒకే కాన్పులో నాలుగు దూడలు జన్మనిచ్చింది. జొన్నాడకు చెందిన నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి కమతం (గోశాల)లో గల ఒక జెర్సీ ఆవు రెండు గిత్త దూడలు (మగ), రెండు పెయ్యి దూడల (ఆడ) లకు జన్మనిచ్చిందని, ఆ దూడలు జన్మించిన వెంటనే ఒక గిత్త దూడ బతికి ఉండగా మిగిలిన మూడు దూడలు చనిపోయినట్లు తెలిపారు. ఏడు లక్షల ఆవుల్లో ఒక ఆవుకు ఇలాంటి అరుదైన సంఘటన చోటుచేసుకుంటుందని వైద్యుడు వెల్లడించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి -కొత్తపేట

వైసిపి ప్రజా వ్యతిరేక విధనాలపై రాజీ లేని పోరాటం చేయాలని టిడిపి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆ పార్టీ శ్రేణులకు సూచించారు నియోజకవర్గం క్లస్టర్ 7,8 పరిధిలో యూనిట్ ఇంచార్జీ,బూత్ కమిటీ కన్వీనర్ ల సమావేశం గురువారం బిళ్ళకుర్రు,వాడపాలెంలలో పార్టీ ఇంచార్జ్, బండారు ఆధ్వర్యంలో జరిగింది

దస్తావేజులు పోయినవి

కొల్లి సోమనాథ్ గారి కుమారుడు కొల్లి కృష్ణ శాస్త్రి గారి యొక్క కోలమూరు గ్రామం సర్వే నెం. 474/5A లోని ప్లాటు నెం. 28 యొక్క డాక్యుమెంటు 1603/1982 మరియు నాయొక్క బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సు నిమిత్తం కోటిపల్లి బస్ స్టాండ్ నుండి గోకవరం బస్ స్టాండ్ ఆటోలో వెళ్ళుచుండగా దారి మధ్యలో పడిపోయినది. కావున దస్తావేజు, బ్యాంకు పాస్‌బుక్ ఎవరికైనా దొరికిన ఎడల నాకు అప్పగించవలెను. తగిన పారితోషకం ఇవ్వబడును. **సెల్ నెం. 73864 97399**

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 50/2020 ఇన్
ఓ.ఎస్.నెం. 32/2013

బిట్వీన్:
కాకర్ల శివకుమారి ***...డి.హెచ్.ఆర్ /వాది***
అండ్
పసుపులేటి వెంకట్రావు (డైడ్) & 3 Others ***...జె.డి.ఆర్స్ /ప్రతివాదులు***

జె.డి.ఆర్-3:
పసుపులేటి బుజ్జిబాబు, తండ్రి: లేటు వెంకట్రావు, డో.నెం.2-10-6, బుక్కాపేట, రామ్ నగర్, నిడదవోలు (P&M), తూ॥గో॥జిల్లా.

పై నెంబరు సేల్ ఇ.పి.లో 3వ జె.డి.ఆర్. అయిన మీకు సదరు కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టుద్వారా సేల్ నోటీసులు ఎన్నిసార్లు పంపినప్పటికిన్నూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా త్రిప్పి పంపుచున్నందున పై కోర్టు వారి తదుపరి ఆదేశం ప్రకారం **ది.28-11-2022 రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరుపు అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు జరిపంచుకోగలరు.** అట్లు కాని ఎడల మీ పరోక్షమున ఇ.పి. తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

టి.రవికుమార్
అడ్వకేట్, కొవ్వూరు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 293/2021

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, R.A.S.M.E.C.C., & S.A.R.C., దానవాయిపేట, రాజమండ్రి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, S.A.R.C. Wing. ***...వాది***
మరియు
మామిడి విజయలక్ష్మి, W/o. సత్యనారాయణ, హిందువు, వయస్సు 68 సం॥లు, R/o. D.No. 29-5-3, ఫ్లాట్ నెం. G-2, లక్ష్మి ఎన్‌క్లేవ్, లక్ష్మివారపుపేట, రాజమహేంద్రవరం. ***...ప్రతివాది***

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-11-2022 సం॥రం తేదీన పై నంబరు గల దావా నందు ఉదయం 10.30 ని॥లకు** మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు పై తేదీన స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.ఎస్.నారాయణస్వామి
కె.ఇందిర
రాజమండ్రి 16-11-2022 అడ్వకేట్స్, రాజమండ్రి